


స్పందన అర్జీదారులకు సత్వర పరిష్కారం చూపాలి : కలెక్టర్

ఏలూరు : స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను త్వరితగతిన, బాధితునికి న్యాయం జరిగేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, జిల్లా అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ రామకృష్ణ, డ్వామా పీడీ రాంబాబు, ఆర్‌డిఒ పెంచల కిషోర్, పోలవరం ఎస్‌డిసి సూర్యనారాయణరెడ్డి, ఎస్‌డిసి కెఆర్‌ఆర్‌సి జివి.సత్యనారాయణతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశ గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు ఇచ్చే పరిష్కార నివేదికకు అర్జీదారుని సమస్యకు సంబంధించిన ఫొటోలను తప్పనిసరిగా జత చేయాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులకు మార్గదర్శనం చేస్తూ అర్జీలు పరిష్కారమయ్యేలా చూడాలని తెలిపారు.

వైసిపి పాలనలో ప్రజాస్వామ్యం పూర్తిగా మంటకలుస్తోంది. ప్రజాసమస్యలపై మాట్లాడమే నేరంగా మారిపోయింది. సమస్యలపై ఆందోళనకు పిలుపునిచ్చినా, సిఎం పర్యటనలు జరిగితే ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు, ప్రజలపై ఉక్కుపాదం మోపుతూ పోలీస్ రాజ్యంగా మార్చేసిన తీరు ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ గృహనిర్బంధంతో ప్రభుత్వం అణిచివేత ధోరణి పరాకాష్టకు చేరింది. గత ప్రభుత్వం జనాలపై ప్రయోగించిన తీవ్ర నిర్బంధాలకు ప్రజాగ్రహం చవిచూసి భారీ మూల్యం చెల్లించుకుంది. వైసిపి ప్రభుత్వం సైతం రానున్న ఎన్నికల్లో ప్రజాగ్రహం చవిచూడక తప్పదన్న చర్చ జనాల్లో కొనసాగుతోంది.



పరాకాష్టకు అణచివేత..!

గత ప్రభుత్వాన్ని మించి దారుణమైన పాలన

ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు, ప్రజలపై ఉక్కుపాదం

పోలీస్ రాజ్యంగా మార్చేసిన దుస్థితి

సమస్యలపై పోరాడితే అరెస్టులు, గృహనిర్బంధాలే

మహిళలపైన కనికరం లేకుండా నిర్బంధకాండ

ఎంఎల్‌సి సాబ్జీ గృహనిర్బంధంపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


2014 ఎన్నికల్లో టిడిపి ఉమ్మడి జిల్లాలో ఉన్న 15 అసెంబ్లీ స్థానాలను, రెండు ఎంపీ స్థానాలను అత్యధిక మెజార్టీతో గెలుచుకుని ప్రతిపక్షం అనేది లేకుండా చేసింది. అదేవిధంగా జిల్లాపరిషత్, మున్సిపాలిటీలు, మండల పరిషత్‌ల్లోనూ ప్రతిపక్ష పార్టీ వైసిపికి చోటు దక్కలేదు. అలాంటి స్థితినుంచి 2019 ఎన్నికల్లో ఆ పార్టీ రెండు ఎంఎల్‌ఎ స్థానాలకు పరిమితంకాగా, ఎంపీ సీట్లు ఒక్కటి కూడా దక్కలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పత్తాలేకుండా పోయింది. దీనంతటికీ ప్రధానకారణం 2014 నుంచి 2019 వరకూ టిడిపి ప్రభుత్వం సాగించిన అరాచక, నిర్బంధ పాలనే కారణమని చెప్పొచ్చు. భీమవరం ప్రాంతం తుందుర్రులో తలపెట్టిన ఫుడ్‌పార్క్‌కు వ్యతిరేకంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రోడ్డెక్కారు. ప్రజాఆందోళన అణిచివేయడానికి టిడిపి ప్రభుత్వం అప్పట్లో వ్యవహరించిన తీరు జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మహిళలపై సైతం హత్యాయత్నం కేసులు నమోదు చేసి జైల్లో పెట్టింది. ప్రజాసంఘాలు, సిపిఎం నాయకులపై పెద్దఎత్తున అక్రమకేసులు బనాయించి తీవ్రఇబ్బందులకు గురిచేసింది. తుందుర్రు గ్రామానికి వెళ్లాలంటే ఆధార్‌కార్డు చూపిస్తే తప్ప వెళ్లనిచ్చేవారు కాదు. చెక్‌పోస్టులు పెట్టి దాదాపు ఎన్నికల వరకూ తీవ్ర నిర్బంధం కొనసాగింది. ఇది టిడిపి ప్రభుత్వంపై జనాల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. ఇక గరగపర్రులో దళితులపై అగ్రవర్ణ పెత్తందారులు చేసిన దాష్టీకంపై అక్కడి ప్రజలు చేసిన పోరాటాన్ని అణిచివేయాలని ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. దీంతో ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుంది. పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను చెప్పుకునేందుకు వీలులేకుండా సిఎం పర్యటనల సందర్భంగా గిరిజనులపై పోలీసులను ఉసిగొల్పి తీవ్ర అణచివేత చర్యలకు దిగింది. చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ బాధితులపైన ఇదేవిధంగా వ్యవహరించింది. ఆక్వా చెరువులకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన సమయంలో టిడిపి ప్రభుత్వం నిరంకుశ ధోరణితో ముందుకు సాగింది. ఇసుక తవ్వకాల విషయంలో ముసునూరు తహశీల్దార్ వనజాక్షిపై జరిగిన దాడి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. సిఎం పర్యటనల నేపథ్యంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నాయకులపై పోలీసులు తీవ్ర నిర్బంధం సాగించారు. అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, ఇతర ఉద్యోగులు చేపట్టిన ఆందోళనపై టిడిపి ప్రభుత్వం దారుణంగా వ్యవహరించింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక నిర్బంధ, నిరంకుశ ఘటనలు టిడిపి ఐదేళ్ల పాలనలో సాగాయి. దీంతో విసిగిపోయిన జనం 2019 ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధిచెప్పారు. కేవలం రెండు సీట్లకే పరిమితం చేసి తమ సత్తా చూపించారు.

వైసిపి ప్రభుత్వంలో అంతకు మించి నిర్బంధకాండ

టిడిపి పాలనతో విసిగిపోయిన జనం వైసిపిని తిరుగులేని ఆధిక్యతతో గెలిపించారు. జనాల ఆశలపై ఈ ప్రభుత్వం నీళ్లు చల్లింది. నిర్బంధకాండలో టిడిపి ప్రభుత్వమంటే ఒక అడుగు ముందుకు సాగుతోంది. అప్పట్లో పోలీసులు కొంత ఆచితూచి వ్యవహరించేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సిఎం వస్తున్నారంటే ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నాయకులను అర్ధరాత్రి, అపరాత్రి అనితేడా లేకుండా వెంటపడి మరి నిర్బంధించడం, అరెస్టులు చేయడం చేస్తున్నారు. సిఎం పర్యటన అంతా బారికేడ్లు, పరదాల మధ్యనే జరుగుతుంది. గతంలో సిఎం పర్యటనల సందర్భంలో ప్రజాసంఘాల నాయకులు సభ వద్దకు వెళ్లి ప్రజాసమస్యపై వినతులు ఇచ్చేవారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నుంచి సిఎంగా పనిచేసిన వారంతా వినతులు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని అధికారులకు అప్పగించేవారు. గత టిడిపి ప్రభుత్వం తొలినాళ్లలో కూడా కొంతమేర ఈవిధానం కొనసాగించింది. నల్లజర్ల మండలంలో సిఎం పర్యటన సందర్భంలో ఒక వ్యక్తి లేచి తమ సమస్యపరిష్కారానికి ఫలానా అధికారి ఇబ్బంది పెట్టారని చెప్పడంతో చర్యలు తీసుకున్న సందర్భాలు సైతం ఉన్నాయి. కామవరపుకోట సభలో కౌలు రైతుల సమస్యపై కౌలురైతు సంఘం నాయకులు వేదికపైకి ఎక్కి మాట్లాడిన ఉదంతాలున్నాయి. కానీ నేడు ఆ పరిస్థితి కనుచూపుమేర కూడా లేకుండాపోయింది. తమసమస్యపై నినదిస్తున్న అంగన్‌వాడీ, ఆశావర్కర్లు వంటి మహిళా ఉద్యోగులపైనా తీవ్ర నిర్బంధాలు ప్రయోగిస్తున్నారు. ఉద్యోగుల ఆందోళనలపై ఉక్కుపాదం ప్రయోగిస్తూ పోలీస్ రాజ్యం కొనసాగిస్తున్నారు. సమస్యపై ఏ ప్రజాసంఘం పిలుపునిచ్చినా అన్ని ప్రజాసంఘాల నాయకులను నిర్బంధం చేస్తున్నారు. కలెక్టరేట్ వద్ద నిరసనలను సైతం నిర్బంధాలతో అణచివేయడం చూస్తున్నారు. ప్రభుత్వం సాగిస్తున్న నిర్బంధ కాండ జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టిడిపికి పట్టిన గతే పడుతుందంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుంది. ప్రశ్నించడమే తప్పుగా ఈ ప్రభుత్వ ధోరణి మారింది. దీంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఎంఎల్‌సి సాబ్జీ గృహనిర్బంధం చర్చనీయాంశం

ఇప్పటి వరకూ ప్రజాసంఘాలు, ఉద్యోగులు, జనాల్లోనే కొనసాగిన నిర్బంధకాండ ఇప్పుడు ఎంఎల్‌సిలను సైతం నిర్బంధించే స్థాయికి చేరింది. ఈనెల 25న జరిగిన సిఎం పర్యటనకు ఎంఎల్‌సి సాబ్జీని ఆహ్వానించి, ప్రోటోకాల్‌లో పేరుచేర్చి, రాకుండా పోలీసులు గృహనిర్బంధం చేసిన తీరు నిరంకుశత్వానికి నిదర్శనమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులను సైతం మాట్లాడకుండా చేయాలన్న ప్రభుత్వ వ్యవహార శైలిపై తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం చేస్తున్న నిర్బంధాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదంటూ జనం చర్చించుకుంటున్నారు.



మాట్లాడుతున్న మిడియం బాబూరావు

గిరిజన చట్టాల నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

గిరిజన సంఘం జిల్లా మహాసభలో జాతీయ నేత, మాజీ ఎంపీ మిడియం బాబూరావు

చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

'పోలవరం' నిర్వాసితులను ఆదుకోవాలి

ఏజెన్సీలో ఆయుధ కర్మాగార నిర్మాణం ఆపాలి

బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చే ఆలోచన విరమించుకోవాలి

ముగింపు సభలో వక్తల డిమాండ్

రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహణ


గిరిజనుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని గిరిజన సంఘం జాతీయ నేత, మాజీ ఎంపీ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో ఆదివారం ప్రారంభమైన ఎపి గిరిజన సంఘం జిల్లా మహాసభ సోమవారం ముగిసింది. తొలుత స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రధానసెంటర్ వరకూ భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళల సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బహిరంగసభ ప్రారంభోత్సవంలో ఇటీవల కాలంలో అమరులైన వారికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహిరంగసభలో మిడియం బాబూరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను తుంగలో తొక్కాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం నూతన అటవీ సంరక్షణ సవరణ చట్టాన్ని తెచ్చి గిరిజనులకు అడవిపై హక్కులేకుండా చేస్తుందన్నారు. తరతరాలుగా అడవిలో జీవించి అడవిని నమ్ముకున్న ఆదివాసీలకు హక్కు పట్టాలు ఇవ్వలేని ప్రభుత్వం అటవీ చట్టాన్ని సవరణ చేయడం ద్వారా ప్రయివేటు, కార్పొరేట్, బడాపెట్టుబడిదారులకు అటవీ భూములను అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందన్నారు. పీసా, ఆర్‌ఒఎఫ్‌ఆర్ గ్రామసభ నిర్వహించకుండా ప్రయివేటు వ్యక్తులకు భూములను కట్టబెట్టేలా ప్రభుత్వం సవరణ చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. అడవులు ప్రయివేటు బడా కార్పొరేట్ వ్యక్తులకు కేటాయిస్తే రూ.10 కోట్ల మంది ఆదివాసీలు అన్యాయం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. సహజవనరులైన అడవులు, ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందన్నారు.

అనంతరం ఎపి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, కార్యదర్శి ధర్మల రమేష్ మాట్లాడుతూ గిరిజన హక్కులను ఒక్కొక్కటిగా హరిస్తూ, బిజెపి ప్రభుత్వం ఒక్కోరాష్ట్రంలో ఒక్కోరకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికే గిరిజనులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. జిఒ మూడుని సుప్రీంకోర్టు కొట్టి వేసిందని, దీనివల్ల గిరిజనులు తమ ఉద్యోగ హక్కులను కోల్పోయే అవకాశం ఉందన్నారు. గిరిజనేతరులు 1/70 చట్టాన్ని నీరుగార్చే కుట్ర జరుగుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకులను గిరిజన జాబితాలో కలపడం రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గపు చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన, ప్రజాసంఘాల అభిప్రాయాలను స్వీకరించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్రంలో 28 లక్షల గిరిజనులుండగా బోయవాల్మీకులు 40 లక్షల మంది ఉన్నారని, వారికి ఎలాంటి భాష సాంప్రదాయ ఆచారాలు లేవని, గిరిజన తెగల జీవనం అటవీ ఉత్పత్తుల సేకరణ వారికి లేవని తెలిపారు. గతంలో అనేక కమిషన్లు బోయ, వాల్మికులకు గిరిజన తెగల అర్హత లేదని ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏకపక్ష నిర్ణయాలతో ఓట్లు కోసమే గిరిజనులను తెగల్లో చేర్చారని విమర్శించారు. అభివృద్ధి చెందిన గిరిజనేతరులను గిరిజనుల జాబితాలో కలపడం ద్వారా అన్ని హక్కులు అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకుల హస్తగతమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన జాబితాలో చేర్చే అసెంబ్లీ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకో వాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఈనెల 31న జరిగే మన్యం బంద్‌లో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ బహిరంగసభలో గిరిజన సంఘం జిల్లా సహాయ ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు, నాయకులు పోలోజు నాగేశ్వరరావు, సుంద్రు బుల్లెమ్మ, ఎం.నాగమణి, ముత్యాలమ్మ, నేలటూరి నిర్మల, కొండలరావు, సీతారామయ్య, అప్పారావు, దావీదు, పెద్దఎత్తున గిరిజనులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విల్లంబులతో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు, నాయకులు

తక్షణం కారుణ్య నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కోవిడ్-1,2లో, ఇతర కారణాలతో మరణించిన ప్రతీ ఉద్యోగి, ఉపాధ్యాయ కుటుంబంలో అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న వారికి తక్షణం కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఎపి జెఎసి అమరావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల, కాంట్రాక్టు, పొరుగు సేవలు, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి ఎపి జెఎసి అమరావతి కార్యాచరణలో భాగంగా సోమవారం తలపెట్టిన 'కారుణ్య నియామకాల ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల పరామర్శ యాత్ర'లో భాగంగా ఎపి జెఎసి అమరావతి, ఏలూరు జిల్లా శాఖ ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా ఛైర్మన్ ఎస్.శివ శంకర్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో మొదటి వేవ్ కోవిడ్‌లో చనిపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల్లో కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసిన వారి ఇంటికి వెళ్లి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 90 కుటుంబాల వరకూ కారుణ్య నియామకాలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లో సుమారు పది కుటుంబాల వరకూ ఉన్నాయని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖలో పిఆర్‌ఐ సబ్ డివిజన్ ఏలూరులో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ 2021 మే నెలలో కోవిడ్‌తో మరణించిన చాగంటి శ్రీనివాసరావు వారి కుటుంబ సభ్యులను, పెదవేగి మండలం వేగివాడలో ఎంపియుపి స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ 2021 మే నెలలో కోవిడ్‌తో మరణించిన కటికల సుహాసిని కుటుంబాన్ని, ఉంగుటూరు మండలం, ఉంగుటూరు జెడ్‌పి హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ 2021 ఏప్రిల్‌లో కోవిడ్‌తో మరణించిన షేక్ నభిహుల్ల కుటుంబాన్ని పరామర్శించారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తూ అసువులు బాసిన ఉద్యోగుల కుటుంబాలకు ఆసరా కల్పిస్తూ వెనువెంటనే ఆ కుటుంబములో అర్హత ఉన్న వ్యక్తికి కారుణ్య నియామకంలో ఉద్యోగం కల్పించి, జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జనరల్ సెక్రెటరీ పి.రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.వర్మ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షులు హుస్సేన్, పంచాయతీరాజ్, జిల్లా కార్యదర్శి వీర్రాజు, ఆర్‌టిసి ఉద్యోగ సంఘ నాయకులు, వివిధ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు రిలే నిరాహార దీక్షలు

సిఐటియు, రైతు సంఘాలు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని దోసపాడు గ్రామంలో అసైన్డ్ భూముల ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేస్తున్న పేదలకు సిఐటియు, రైతు సంఘం జిల్లా కమిటీలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ పేదలు, దళితులు భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినా జిల్లాలో రెవెన్యూ శాఖ అధికారులు అమలు చేయడం లేదని విమర్శించారు. గత 25 ఏళ్ల నుంచి దోసపాడులో స్థానికేతర భూస్వాములు దళితుల, పేదల భూములను దౌర్జన్యంగా, అక్రమంగా ఆక్రమించుకొని దర్జాగా అనుభవిస్తున్నారన్నారు. సుమారు 350 ఎకరాల పేదల భూములను స్థానికేతర భూస్వాముల చేతుల్లో గత పాతికేళ్లుగా ఉన్న వాటిపై విచారణ జరపాలని రెవెన్యూ శాఖ అధికారులు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలు, దళితులు గత పది నెలల నుంచి ఈ పోరాటం చేస్తున్నా, ముఖ్యమంత్రి ఈ నియోజకవర్గంలో పర్యటన చేసినా పేదలకు న్యాయం జరగలేదన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అధికారులు గ్రామంలో పేదలందరూ పోరాడుతుంటే కనీసం పట్టించుకోకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు స్పందించి పేదలకు న్యాయం చేయాలని, వారి న్యాయమైన కోరికలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. లేకపోతే వీరికి అండగా వ్యవసాయ కార్మిక సంఘంతో పాటు సిఐటియు, రైతు సంఘం కౌలు రైతుల సంఘాలు, దళిత సంఘాలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు సన్నద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ దీక్షకు ఆనందరావు, నాగేంద్ర, గంగాధర్, లలిత మద్దతు తెలిపారు.

వ్యవసాయ సంక్షోభానికి బిజెపి విధానాలే కారణం

'చలో ఢిల్లీ' ప్రచార జాతాలో నేతలు


జంగారెడ్డిగూడెంలో ప్రచార జాతా

ప్రజాశక్తి - దెందులూరు

వ్యవసాయ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. వచ్చేనెల ఐదో తేదీన చేపడుతున్న కార్మిక, కర్షక చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు, రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతా సోమవారం దెందులూరు మండలంలోని కొవ్వలి, దోసపాడు, పోతునూరు గ్రామాల మీదుగా సాగింది. ఆయా గ్రామాల సెంటర్లలో జరిగిన సభల్లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అందరూ నిరసించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగానే రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేకపోతున్నారని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50శాతం కలిపి మద్దతు నిర్ణయించి అమలు చేయాలని, అందుకు గిట్టుబాటు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలన్నారు. ప్రాజెక్టు పూర్తిచేసి గోదావరి డెల్టాలోని రబీ పంటకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా కార్యదర్శి కె.విజయలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గండి రాజా, సున్నా వెంకటరావు పాల్గొన్నారు.

భీమడోలు : చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ప్రచార జాతా మండలంలో పర్యటించింది. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.విజయలక్ష్మి, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ సమన్వయకర్త వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కెవిపిఎస్ మండల కన్వీనర్ కె.సుమన్‌బాబు నాయకత్వం వహించారు. ఈ ప్రచార జాతా గుండుగొలను, కురెళ్లగూడెం, పూళ్ల, భీమడోలు మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : చలో ఢిల్లీ విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చేపట్టిన ప్రచార జాతా మండలంలోని ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం, తిమ్మాపురం, ద్వారకాతిరుమల గ్రామాల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో కె.విజయలక్ష్మి కట్టా భాస్కర్‌రావు, గుర్రం రాంబాబు, నందమూరి త్రినాథ్, బోయపాటి సత్యనారాయణ, తూంపాటి మురళీ, పి.నాగరాజు, నార్ని దుర్గారావు పాల్గొన్నారు.

చింతలపూడి : వచ్చేనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీని రైతులు, కార్మికులు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామిశెట్టి సత్యనారాయణ కోరారు. చింతలపూడిలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.బాలరాజు సోమవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ, రైతు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఏప్రిల్ 5 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా జీపు ప్రచారయాత్ర బృందం మండలంలోని కైకరం, చేబ్రోలు, ఉంగుటూరులో పర్యటించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన కనీస ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, కె.వెంకట్రావు, శ్రీరామచంద్రమూర్తి, ఆకుల రాజశేఖర్, ఎం.నాగరాజు, పాలపర్తి అప్పారావు, ఎండి.మజార్, గుడ్ల నరేష్, కరక భరత్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చలో ఢిల్లీ ప్రచార యాత్ర జంగారెడ్డిగూడెం చేరుకుంది. ఈ కార్యక్రమంలో సిఐటియు టౌన్ అధ్యక్షులు పసల సూర్యారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్, సిఐటియు సీనియర్ నాయకులు చల్లారి మాణిక్యాలరావు, సిఐటియు సీనియర్ నాయకులు యు.సత్యనారాయణ, యువజన సంఘం నాయకులు షేక్ మాబు సుభాని, రైతు సంఘం నాయకులు బొడ్డు రాంబాబు, విద్యార్థి సంఘం నాయకులు బి.యశ్వంత్, ఎస్.మణి, యువజన సంఘం సీనియర్ నాయకులు వి.గోపి, ఆటో యూనియన్ నాయకులు బి.నాని, అంగన్‌వాడీ వర్కర్స్ లక్ష్మీదేవి, జగదీశ్వరి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వ భరోసా : ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎంఎల్‌ఎ ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్(నాని) అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కొత్తగా మంజూరైన 16 కొత్త 104 సర్వీసు వాహనాలను మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జెండాఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, కార్పొరేటర్ ఎర్రంశెట్టి సుమన్, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవి, ఎపి స్టేట్ మెడికల్ కౌన్సిల్ బోర్డు సభ్యులు డాక్టర్ దిరిశాల ప్రసాద్, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ, 104, 108 జోనల్ మేనేజర్ కె.గణేష్, 104 జిల్లా మేనేజర్ డి.విలియమ్‌చంద్, డిఐఒ నాగేశ్వరరావు, అడిషనల్ డిఎంహెచ్ఒ రత్నకుమారి, ఆర్ఎంఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి జగన్ అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. వైద్య, ఆరోగ్య రంగాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ఎన్నో విప్లవాత్మకమైన కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతో మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 104, 108 సర్వీసులతోపాటు ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని తీసుకువచ్చి ఎంతోమంది ప్రాణాలను కాపాడారన్నారు. అయితే అలాంటి కార్యక్రమాన్ని గత ప్రభుత్వం నిరుపయోగం చేసిందన్నారు. అదే విధంగా ఆరోగ్యశ్రీ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి తీసుకువచ్చిందన్నారు. అయితే జగన్ అధికారంలోకి రాగానే ప్రజారోగ్యానికి భరోసా కల్పించే కార్యక్రమాలను సమర్థవంతంగా చేపడుతున్నారన్నారు.

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పేదలకు గడప దగ్గరకే వెళ్లి మెరుగైన వైద్యాన్ని అందించే దిశగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇప్పటికే సచివాలయాల పరిధిలోని వైఎస్‌ఆర్ హెల్త్ క్లీనిక్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. దానిలో భాగంగా ఇప్పటికే 27 మండలాల్లో 104 సర్వీసు వాహనాలు అందుబాటులో ఉండగా, మండలంలోని ప్రతీగ్రామ సచివాలయ పరిధిలో రెండుసార్లు పరిపూర్ణంగా వైద్య సేవలు అందించేందుకు మరో 16 కొత్త 104 సర్వీసు వాహనాలను జిల్లాకు ప్రభుత్వం ఇచ్చిందన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

ప్రజాశక్తి - పోలవరం

బోయ వాల్మీకులను, బొంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏజెన్సీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. బోయ వాల్మీకులను, బొంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని, దీనివల్ల గిరిజన ప్రజలు చాలా నష్టపోతారని, రాష్ట్ర ప్రభుత్వం తన ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా బొంతు ఒరియాలను, బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తున్నారని, దీన్ని గిరిజన ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళన చేస్తామని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు హెచ్చరించారు.

సహకార సంఘాలతో రైతుల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సహకార సంఘాలు దోహదపడతాయని మక్కినవారిగూడెం సొసైటీ ఛైర్‌పర్సన్ పిన్నమనేని చక్రవర్తి అన్నారు. స్థానిక సహకార సంఘం ఆవరణలో సంఘం ఛైర్ పర్సన్ పిన్నమనేని చక్రవర్తి అధ్యక్షతన మహా జనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సిఇఒ యువివి.సత్యనారాయణ సంఘ అజెండా, లాభ నష్టాలను చదివి వినిపించారు. అనంతరం చక్రవర్తి మాట్లాడుతూ రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందించి రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. సొసైటీ ఎరువులు, మినరల్ వాటర్‌ప్లాంట్, పాల వ్యాపారం వంటి సేవల ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. రైతులు సహకార సేవలు వినిగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం పర్సన్‌లు దాసరి రామచంద్రరావు(రాంబాబు), మండలపు మూర్తి, మాజీ అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ, కార్యదర్శి యువివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో బాలుర హైస్కూల్ విద్యార్థుల హవా

జంగారెడ్డిగూడెం : నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిష్ (ఎన్‌ఎంఎంఎస్) కోసం కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో స్థానిక జెడ్‌పిహెచ్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయులు గెడ జగ్గారావు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్షిప్ పరీక్షలలో ప్రతిభ కనపరచి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ఐదు సంవత్సరాలకు అందించే ఉపకార వేతనాలకు బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు తొమ్మిది మంది విద్యార్థులు బి.గీతిక, కె.నిధి, పి.సింధు రమ్య,ఎ.నైసీ, డి.వేద్య శ్రీ సత్య నాగబాల, కె.సాత్విక, ఎ.యశ్వంత్ పవన్ సాయి, ఎండి.అలీ, కె.శరత్ మధు కార్తీక్ ఎంపికయ్యారని తెలిపారు.

నవజాత శిశు సంరక్షణే ధ్యేయం

ప్రజాశక్తి - పోలవరం

నవజాత శిశుసంరక్షణ ధ్యేయంగా సేవలు అందిస్తున్నామని నవజాత శిశువైద్యురాలు కె.తమల్లిక అన్నారు. పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఎస్ఎన్‌సియు కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ప్రాథమిక వైద్యశాలలన్నిటినీ నాలుగు నెలలుగా పరిశీలించినట్లు చెప్పారు. మూడు నెలల లోపు నవజాత శిశువులకు వైద్య సేవలందిస్తామని ఎల్ఎన్‌డి పేట, వింజరం ప్రాథమిక వైద్యశాలల పరిధిలో ప్రజలకు తెలిపినట్లు చెప్పారు. ప్రతినెలా 300 మంది నవజాత శిశువులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతిరోజు కనీసం పది మంది నవజాత శిశువులకు వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో నవజాత శిశువుల వైద్య సేవలు విస్తృత పరుస్తామని, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

విద్యార్థులు మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకుని బత్తిడిని జయించాలని హెల్త్ ఎడ్యుకేటర్ సిహెచ్.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన సదస్సులో అన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షల ఒత్తిడిని ఎలా నిర్వహించాలనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు కిషోర్‌కుమార్, రాజారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది సయ్యద్ జప్రుల్లా, విజయనిర్మల పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - చింతలపూడి

తన నటనతో, సేవా కార్యక్రమలలో గ్లోబల్ స్టార్‌గా రామ్‌చరణ్ పేరు తెచ్చుకున్నారని రామ్‌చరణ్‌తేజ్ ఫ్యాన్స్ మండల అధ్యక్షులు కొప్పుల నాని అన్నారు. పట్టణంలో రత్నహాల్ వద్ద రామ్‌చరణ్‌తేజ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగాస్టార్ తనయుడుగా సినిమారంగం ప్రవేశం చేసి, తన నటనతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగి గ్లోబల్ స్టార్‌గా పేరు సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కె.నాగరాజు, సూర్య, రెహమన్, నరేష్, పఠాన్ పాల్గొన్నారు.

పాఠశాలలో పోషణ్ అభియాన్ సంబరాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు అభియాన్ సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులకు పోషకాహారంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి ధనలక్ష్మి, ద్వితీయ బహుమతి మనోహర్, తృతీయ బహుమతి అరుణ సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, ప్రవీణ్, మనోహరం, సుశీల కుమారి, మల్లీశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు రోజా, జయమణి, కుసుమకుమారి, దుర్గ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలను బహిరంగ మలవిసర్జన నిర్మూలన ప్లస్ గ్రామాలుగాను, చెత్త నుంచి గ్రామాలను రక్షించాలని భీమడోలు మండల పరిషత్ అధికారి రాఘవన్ కోరారు. ఏలూరు డివిజన్ స్థాయిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వాహకులతో ఆదర్శ గ్రామంగా తయారైన భీమడోలు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వేదికగా ఏలూరు డివిజన్ స్థాయిలోని వివిధ గ్రామపంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ నుంచి రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖలకు చెందిన సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. ఒక్కొక్క మండలం నుంచి ఎంపిక చేసిన గ్రామాలకు చెందిన వారికి రిసోర్స్ పర్సన్లు ఈ తరహా శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సర్పంచ్ పాము సునీత మాన్‌సింగ్ అధ్యక్షత వహిస్తారు. ఈ కార్యక్రమంలో భీమడోలు పంచాయతీ కార్యదర్శి నాగూర్, ఏలూరు డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి రమణ, శిక్షణ తరగతుల రిసోర్స్‌పర్సన్ కృష్ణంరాజు, డిఎల్‌పిఓ టెక్నికల్ సిబ్బంది శ్యామలరావు పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని డ్రగ్ మాఫియాగా మార్చిన వైసిపి'

ప్రజాశక్తి - పోలవరం

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉండి భారతదేశానికి తలమానికం అయిన తిరుమల, తిరుపతి దేవస్థానంలో డ్రగ్ మాఫియా కలకలం హిందువుల మనసులను కలవరం చేసిందని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు విమర్శించారు. పోలవరంలో ఆయన నివాసంలో సోమవారం పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని ఈ ప్రభుత్వం డ్రగ్ మాఫియాకి రాజధానిగా మార్చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ రైతు నాయకులు కుంచే దొరబాబు, అసెంబ్లీ తెలుగు మహిళ అధ్యక్షురాలు కుంజం సుభాషిణి, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు గుబ్బా రాంబాబు పాల్గొన్నారు.

నూజివీడు :దేశంలోనే డ్రగ్స్ క్యాపిటల్‌గా ఆంధ్రప్రదేశ్ మారిందని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో వార్షిక నివేదికల ప్రకారం దేశంలో గంజాయి, డ్రగ్స్ వాడకంలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగంలో ఉందన్నారు. 2018లో గంజాయి 6600 కేజీలు స్వాధీనం అవ్వగా, వైసిపి ప్రభుత్వం హయంలో 2.60 లక్షల కేజీలు స్వాధీనం అయిందన్నారు. రాష్ట్రం నుంచి రోజుకు టన్నుల కొద్ది గంజాయి రవాణా అవుతున్న కేవలం 1775 కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు. గంజాయి మాఫియాకు వైసిపి నేతలు ఏ విధంగా సహకరిస్తున్నారో దీనిబట్టే స్పష్టమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు మాజీ అధ్యక్షులు చిట్నేని శివరామకృష్ణ, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు : ఎఒ

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందించనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి డి.ముత్యాలరావు తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ పంట విరామంలో నేలలు సారవంతంగా మార్చుకునేందుకు పచ్చిరొట్ట విత్తనాలు దోహద పడతాయన్నారు. జీలుగు 400, జనుము 280, పిల్లిపెసర 80 క్వింటాళ్లు పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందించనున్నామని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాల సాగుతో భూసారం పెంపొందించుకోవచ్చునని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగుచేయడం వల్ల భూమికి ఎరువుల వినియోగం తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

పంట ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో ధ్వంసం చేయించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పెదవేగి మండలం మొండూరు గ్రామానికి చెందిన బలుసు రామారావు కుమారుడు శ్రీనివాసచౌదరికి మండలంలోని గుడ్లపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 73లో తొమ్మిది ఎకరాల పొలం ఉండగా దానిలోని ఎనిమిది ఎకరాల్లో పామాయిల్ తోట ఉందని, మిగిలిన ఒక ఎకరంలో మొక్కజొన్న పంట వేశారు. ఈ పంటను ఈ నెల 20న రాత్రి సమయంలో జిల్లాలోని దెందులూరు గ్రామానికి చెందిన కొడాలి శ్రీ కృష్ణ వరప్రసాద్, ఆయన ఇద్దరు కుమార్తెలు సుజాత, స్రవంతి ముగ్గురూ కలిసి బలుసు శ్రీనివాసచౌదరి పొలంలోకి అక్రమంగా ప్రవేశించి ట్రాక్టర్‌తో సుమారు రూ.లక్ష విలువైన మొక్కజొన్న పంటను దున్నించివేసి పంట నష్టం కలిగించారని బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు


టి.నరసాపురం :వ్యక్తిపై దాడిచేసి గాయపరచిన ఘటనలో మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఇందిరాకాలనీకి చెందిన పూరేటి ప్రసాద్ తన ఇంటి సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఈ నెల 23న ఇద్దరు వ్యక్తులు పడుతుండగా వారికి సర్ది చెప్పడానికి ప్రయత్నించిన ప్రసాద్‌పై టి.నరసాపురానికి చెందిన తాడిగడప కిషోర్ పక్కనే ఉన్న రాయి, కర్రతో దాడి చేశాడు. గాయపడిన ప్రసాద్‌ను స్థానికులు 108 అంబులెన్స్ సహకారంతో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్షయ నివారణకు కృషి చేయాలి

జిల్లా క్షయ నివారణాధికారి జి.రత్నకుమారిని సత్కరించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

క్షయవ్యాధి రహిత దిశగా పురోగతి సాధించినందుకు ఏలూరు జిల్లా జాతీయ అవార్డు పొందడం ఆనందదాయకమని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. క్షయ వ్యాధి నియంత్రణలో జిల్లా బంగారు పతకం పొందిన సందర్భంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా క్షయ నివారణ అధికారి జి.రత్నకుమారిని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శాలువతో సత్కరించి పూల మొక్కను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సమాజంలో క్షయవ్యాధి(టిబి) విస్తరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. 2025 నాటికి ఈ వ్యాధిని పూర్తిగా అంతం చేసే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేయాలన్నారు. క్షయ వ్యాధి రహిత జిల్లాగా ఉంచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వైద్యాధికారులకు తెలిపారు. ఇందుకు వైద్యశాఖ కృషి ఒక్కటే సరిపోదని స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సంయుక్తంగా పోరాడినప్పుడే క్షయవ్యాధి రహిత సమాజాన్ని చూడగలుగుతామన్నారు. గ్రామస్థాయిలో ప్రచార కార్యక్రమాలపై ప్రధాన దృష్టి పెట్టాలన్నారు. అదేరీతిలో క్షయవ్యాధిపై ముందస్తు చర్యలపైనే వైద్యులు దృష్టిపెడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలన్నారు.



రత్నకుమారిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఈ సందర్భంగా క్షయవ్యాధి నిర్మూలనకు అంకిత భావంతో కృషి చేస్తున్న జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి జి.రత్నకుమారితో పాటు ఇతర సంబంధిత వైద్యాధికారులను, సిబ్బందిని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అభినందించారు.

న్యాయవాద గుమాస్తాల సంఘం ఎన్నికల్లో రాము విజయం

ప్రజాశక్తి - ఏలూరు



నల్లా రాము

న్యాయవాద గుమాస్తాల సంక్షేమ సంఘం ఎన్నికల్లో నల్లా రాము విజయం సాధించారు. సంఘం ఎన్నికలు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాద గుమాస్తాల సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థి ఎస్‌పి.వెంకటేశ్వర రావుపై 32 ఓట్ల మెజార్టీతో రాము గెలుపొందారు. అలాగే ఉపాధ్యక్షులుగా పులిచర్ల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బేతపూడి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా ప్రకాష్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నష్టపరిహారం ఇప్పించాలని వినతి

జంగారెడ్డిగూడెం :పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కలుషిత వ్యర్థాల వల్ల మృతి చెందిన నాలుగు గేదెలకు నష్టపరిహారం ఇప్పించాలని బాధిత పాడి రైతు కె.భాస్కరరావు ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి నాలుగు గేదెలకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. దీనిపై ఆర్‌డిఒ ఝాన్సీరాణి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. పలు భూ సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు.

పర్వతాపురంలో రీ సర్వే

చాట్రాయి :మండలంలోని పర్వతాపురంలో డ్రోన్ సహా యంతో చేస్తున్న భూముల రీ సర్వేలో సోమవారం రాష్ట్ర కోపరేట్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మిద్దె శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ రీ సర్వే ద్వారా భూములు ప్రతిఒక్క పట్టాదారులకు పాసుబుక్కులు ఇచ్చేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించారన్నారు. మండల సర్వేయరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో డ్రోన్ సర్వే జరుగుతుందని చెప్పారు. సర్వేయర్లు, వైసిపి మండల అధ్యక్షులు మిద్దె బాలకృష్ణ పాల్గొన్నారు.

సుంకొల్లులో ఎన్ఎస్ఎస్ శిబిరం

నూజివీడు రూరల్ :మండలంలోని సుంకొల్లు గ్రామంలో ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం సోమవారం నాటికి ఐదో రోజుకు చేరింది. దీనిలో భాగంగా బాలిక విద్య ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిర్మూలన అంశంపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత బాలికలకు వివాహం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎస్.లక్ష్మీకుమారి అన్నారు. మండలంలోని బర్రింకలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన వంటకాలు తయారు చేసి గర్భిణులకు, బాలింతలకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. దాని వల్ల రక్తహీనత లేకుండా ఉంటారన్నారు. పుట్టబోయే బిడ్డకు మంచి పోషకాలు అందుతాయన్నారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎఎన్ఎం ప్రియాంక, ఆశావర్కర్ సిహెచ్ .జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్త స్వర్ణ, ఆయా రాధ పాల్గొన్నారు.

నిర్మాణానికి అనువైన స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

పేదలందరికి ఇళ్ల స్థలాల కేటాయింపులో ద్వారకాతిరుమలలో 322 మంది లబ్ధిదారులకు ఇటీవల స్థలాలు వసంతనగర్ కాలనీ, పోలీస్ క్వార్టర్స్ వెనుక పుట్ట కేటాయించారు. వారికి కేటాయించిన స్థలాలు ఎక్కడ ఉన్నాయో తెలియక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో సోమవారం ఉదయం విఆర్‌ఒలు, సర్వేయర్లు లబ్ధిదారులను స్థలాల వద్దకు పిలిచి వారి స్థలం ఎక్కడ ఉందో వారి ప్లాట్ నెంబర్లతో తెలియచేసి చూపించారు. కొంత మంది లబ్ధిదారులు ఈ స్థలాలు మాకొద్దని, ఇళ్లు కట్టుకోవడానికి అనుకూలంగా లేవని వెనుతిరిగి వెళ్లిపోయారు. ఈ స్థలాలు మైనింగ్ జరిగిన ఏరియాలో ఇవ్వడం వల్ల ఇక్కడ నిర్మించే ఇళ్లు దృఢంగా ఉండవని, అందువల్ల ప్రభుత్వం వేరే చోట స్థలాలు కేటాయించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి

ప్రజాశక్తి - కైకలూరు

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతి ఏటా నగదు బహుమతులు అందిస్తానని వైసిపి రాష్ట్ర నాయకులు బొడ్డు నోబుల్ తెలిపారు. మండలంలోని దొడ్డిపట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన ప్యాడ్లు, పెన్నులు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు మార్పు చెందాయన్నారు. సిఎం జగన్ ప్రతి పేదవాడు ఉన్నత విద్య అభ్యసించాలని, విద్యకోసం పెద్దపీట వేశారన్నారు. పది పరీక్షల్లో మంచి సాధించినవారికి రూ.మూడు వేల నగదు బహుమతి అందిస్తానని తెలిపారు.

అప్పలనాయుడు అంత్యక్రియలకు తరలిన కార్మికులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆయన రాజకీయ నాయకుడు కాదు... సెలబ్రిటీ కాదు... కాని కష్ట జీవులకు దేవుడయ్యాడు.... ఆయన అకాల మరణంకార్మికులను శోక సముద్రంలోకి నెట్టేసింది. శనివారం ఆయన అంత్యక్రియలకు కార్మిక లోకం కదలి వచ్చి కన్నీటి సంద్రాన్ని తలపించింది. ఆదివారం బైపాస్ రోడ్డులో కారు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన పట్టణ ప్రజలకు సుపరిచితుడు, సీనియర్ తాపీ మేస్త్రీ కేతిరెడ్డి అప్పలనాయుడు అంత్యక్రియలు సోమవారం జరిగాయి. ఆయన మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించడంలో సుమారు రెండు వేల మంది భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. పట్టణ ప్రధాన రహదారుల్లో కార్మికులు స్వయంగా అప్పలనాయుడు దేహాన్ని భుజాలపై మోస్తూ శ్మశానవాటికకు చేర్చారు.

అన్ని గ్రామాలకూ మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వేగవంతంగా వైద్య సేవలు అందించే దిశగా కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అపారావు అన్నారు. పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రతాప్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వేగవంతమైన వైద్యం పేదలకు అందేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సకాలంలో వైద్యం అందించడం, ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే 108 అంబులెన్స్ సేవలు క్షతగాత్రులు పొందేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ఇందుకోసం ప్రతి మండల కేంద్రంలో 108 అంబులెన్స్, 104 వైద్య సేవలు అందిస్తున్నట్లుగా తెలిపారు. నూజివీడులో అత్యాధునిక వసతి సౌకర్యాలతో కొత్త భవనం త్వరలో ప్రారంభించనున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, కో ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, వైసిపి యువ నేత పిల్లా చరణ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్ర సింగ్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కుల అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ అందరి హృదయాల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. మండలంలోని వికేయం ఫంక్షన్‌హాల్ వద్ద సోమవారం స్వయం సహాయ సంఘాలకు మూడో విడత ఆసరా చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి, వైఎస్ఆర్ చేయూత, సున్నా వడ్డీకే రుణాలు, ఆసరా వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి చేపట్టడం మహిళల అదృష్టమన్నారు. చింతలపూడిలో 2053 సంఘాలకు రూ.24.16 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జానకిరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు నీరజ సుధాకర్, ఎంపిపి డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో 25 సచివాలయాల పరిధిలో 1568 డ్వాక్రా గ్రూపుల్లో 15554 మందికి రూ..14.69 కోట్ల రుణమాఫీ అయ్యాయని ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా సెక్రటరీ, యానిమేటర్లుతో సమావేశం నిర్వహించారు. ఉంగుటూరు జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంఎల్ఎ సోదరుడు పుప్పాల చినబాబు, వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు పాల్గొన్నారు.

చాట్రాయి :వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని సోమవారం చాట్రాయి మండలంలో నిర్వహించారు. మండల కేంద్రమైన చాట్రాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఇచ్చిన మాట మేరకు వైఎస్ఆర్ ఆసరా పథకంలో భాగంగా మూడో విడత లబ్ధిదారుల ఖాతాలకు జమ సొమ్ము జమ చేసినట్లు తెలిపారు. చాట్రాయి మండలంలో 1119 మహిళా సంఘాలకు రూ.8.90 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపిపి లంక నిర్మల, జెడ్‌పిటిసి సభ్యులు చెలికాని అనూష, గ్రామ సర్పంచి దామెర ఉష పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం హుండీని సోమవారం అధికారులు లెక్కించారు. 102 రోజులకు స్వామివారికి ఆదాయంగా రూ.14,42,782 నగదు, బంగారం రెండు గ్రాములు, 850 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో సేవ కమిటీ సభ్యులు, గుడివాడ డివిజన్ దేవాదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్, ఆలయ ఎసి నేల సంధ్య ధర్మకర్తలి మండలి సభ్యులు శివనాగేంద్ర, సిహెచ్.శ్రీనివాసరావు, చేదెళ్ల శారద పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - ముసునూరు

ఎరువులు, పురుగుమందులు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి ధరలకు విక్రయించాలని ఎడిఎ వెంకటమణి అన్నారు. మండలంలోని ముసునూరు, చెక్కపల్లి గ్రామాల్లో ఉన్న క్రిమిసంహార మందులు, రసాయనిక ఎరువుల షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. వ్యవసాయ పంటలకు ఉపయోగించే ఎరువుల ధరలు అధిక రేట్లకు అమ్మితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. కొన్ని షాపుల్లో నిల్వ ఉన్న సరుకును పరిశీలించి, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు కూడా లైసెన్స్ ఉన్న షాపుల వద్ద కొనుగోలు చేసి ప్రతి కొనుగోలుపై రశీదు పొందాలన్నారు. మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

నేడు ఆవు, గేదె దూడల ప్రదర్శన

జీలుగుమిల్లి :మండలంలోని దర్భగూడెం పశు వైద్యశాలలో ఒక సంవత్సరం లోపు వయసు కలిగిన ఆవు, గేదె దూడల ప్రదర్శన ఈ నెల 28 మంగళవారం నిర్వహించనున్నట్లు వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ ఎడి సాయి బుచ్చారావు తెలిపారు. పాడి రైతులకు దూడలపెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన దూడకు బహుమతితో పాటు మెడికల్ కిట్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

In The Court Of The IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P.No. 167/2022

Between:
Rayudu Padma Latha ...*Petitioner*
AND
Shaik Khadhar @ Khadhar Vali and another ...*Respondents*

Notice to Respondent:
R-1: Shaik Khadar @ Khadar Vali, S/o. Late Johny, Hindu, Age 41 Years, D.No. 23-156, Maseedu Road, Patha Peta, Nuzvid, Krishna Dt., Pin: 521 201 (Driver Cum Owner of Lorry Bearing Regd.No. AP 27 TW 1832)
In the above M.V.O.P.No. 167/2022 the 1st respondent hearing date stand posted to **17-05-2023 at 10:30 A.M. before the 2nd Additional District and sessions Judge, Amalapuram, E.G.Dist.** Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.
Hearing Date : 17-05-2023

N.RAJASEKHAR
Amalapuram, 25-3-2023.
Advocate, Amalapuram. Cell: 98491 93665

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా కోర్టు వారి దివ్య సముఖమునకు, అమలాపురం
I.A. No. 288/2021, O.S. No. 7/2021

Between:
ఆరుమిల్లి వీర వెంకట సుబ్బారావు -పిటీషనర్/వాది
AND
సిర్రా ఆల్‌ఫ్రెడ్ and others -రెస్పాండెంట్స్/ప్రతివాదులు

పేపరు ప్రకటన

R-4 రెస్పాండెంట్/ప్రతివాది: దేవల్ల వరలక్ష్మి, W/o. హనుమంతరావు, Hindu, House wife, age 49 years, D.No. 2-42, కుమ్మర్లపాలెం, ఇలపకుర్రు గ్రామం, యలమంచిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
పై నంబరు దావాలో O.S. No. 7/2021 లో I.A. No. 288/2021 4వ రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు I.A. నోటీసులు పంపినను మీకు అమలు జరిగి యుండలేదు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం పేపరు ప్రకటన ద్వారా 4వ రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీకు తెలియపరచుచున్నాము. వాయిదా. **10-04-2023వ తేదీన మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారు ద్వారా గాని వచ్చి 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియపరచుకోవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.
వాయిదా: 10-04-2023
సమయం: 10.30 ని॥లకు

K.MALLAPARAJU
K.S.SRIRAM
Advocates, Amalapuram

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా కోర్టు వారి దివ్య సముఖమునకు, అమలాపురం
O.S. No. 7/2021

Between:
ఆరుమిల్లి వీర వెంకట సుబ్బారావు -వాది
AND
సిర్రా ఆల్‌ఫ్రెడ్ and others -ప్రతివాదులు

పేపరు ప్రకటన

D-4 ప్రతివాది: దేవల్ల వరలక్ష్మి, W/o. హనుమంత రావు, Hindu, House wife, age 49 years, D.No. 2-42, కుమ్మర్లపాలెం, ఇలపకుర్రు గ్రామం, యలమంచిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
పై నంబరు దావాలో O.S. No. 7/2021 లో 4వ ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినను మీకు అమలు జరిగి యుండలేదు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం పేపరు ప్రకటన ద్వారా 4వ ప్రతివాది అయిన మీకు తెలియపరచుచున్నాము. వాయిదా. **10-04-2023వ తేదీన మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారు ద్వారా గాని వచ్చి 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియపరచుకోవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.
వాయిదా: 10-04-2023
సమయం: 10.30 ని॥లకు

K.MALLAPARAJU
K.S.SRIRAM
Advocates, Amalapuram

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు
ఇ.ఎ. 221/2018, ఓ.యస్. 179/2017

శ్రీ పెనుగంటి వెంకట రాంబాబు -పిటీషనరు/వాది
మరియు
జిల్లా కలెక్టరు, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు, వగైరా -రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై నెంబరు దావాలో 11వ ప్రతివాది అయిన శ్రీ పిల్లా రామారావు చనిపోయినందున వారి తాలూకు వారసులను దావాలో 20, 21 నెంబరు ప్రతివాదులుగా చేర్చమని కోరుతూ పై నెంబరు ఇ.ఎ. 221/2018 దాఖలు చేయగా, 21 రెస్పాండెంటు శ్రీమతి ఎల్లపు కన్యాకుమారి, భర్త: శ్రీ నాగరాజు, ధర్మారావుపేట, దెందులూరు మండలం వారికి నోటీసు నిమిత్తం **ది. 31-3-2023వ తేదీని వాయిదా అయి వున్నది.** కాబట్టి సదరు శ్రీమతి ఎల్లపు కన్యాకుమారి గారు పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల వారిని ఎక్సుపార్టీ చేసి తగు ఉత్తర్వులు పాస్ చేయగలరు.

ఏలూరు 27-3-23
యస్.వి.ఆర్.గాంధీ
వాది తరపు అడ్వకేట్, ఏలూరు

గ్రామపంచాయతీ కార్యాలయము - రాజులపేట
టెండరు నోటీసు

రి.క. నెం. /2023 తేది.27-03-2023

పశ్చిమగోదావరి జిల్లా, ఆకివీడు మండలం, రాజులపేట గ్రామపంచాయితీకి 2023-2024 సంవత్సరమునకు ఈ క్రింది వివరించిన ప్రకారము ది. 01-4-2023 నుండి 31-3-2024 సంవత్సరము వరకు పంచాయతీ పనులు చేయుటకు మరియు సామానులు సప్లయి చేయుటకు ఈక్రింది వివరించిన ప్రకారము టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 31-03-2023 సంవత్సరము తేదీన ఉదయం 11:00 గంటల వరకు స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 12:00 గంటలకు టెండరుదారులు సమక్షంలో తెరువబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకుని పోస్టు ఒక్కంటికి రూ. 50/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళయందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు
1	పారిశుద్ధ్య పనులు నిర్వహణకు 2 పోస్టులు	రూ. 50/-లు
2	రక్షిత మంచినీటి సరఫరా పంపు ఆపరేటరు 1 పోస్టులు	రూ. 50/-లు
3	వీధి లైట్లు రిపేరు చేయువానికి పోస్టు 1	రూ. 50/-లు
4	వాటర్ వర్క్సు సామాన్లు	రూ. 50/-లు
5	ఆఫీసు స్వీపింగ్ చేయుటకు 1 పోస్టు	రూ. 50/-లు
6	పారిశుద్ధ్య ప్రజారోగ్య సామాన్లు	రూ. 50/-లు
7	వీధి లైట్స్ విడి భాగములు మరియు కొత్త సెట్స్	రూ. 50/-లు
8	స్టేషనరీ సామానులు సప్లయ్	రూ. 50/-లు

నోట్: గ్రామపంచాయితీ నగదు నిల్వలను బట్టి పేమెంట్లు ఇవ్వబడును.

సం/- **వై.రఘునాధరావు,** పంచాయితీ కార్యదర్శి
రాజులపేట, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము - దుంపగడప
టెండరు నోటీసు

రి.క. నెం. /2023 తేది.27-03-2023

పశ్చిమగోదావరి జిల్లా, ఆకివీడు మండలం, దుంపగడప గ్రామపంచాయితీకి 2023-2024 సంవత్సరమునకు ఈ క్రింది వివరించిన ప్రకారము ది. 01-4-2023 నుండి 31-3-2024 సంవత్సరము వరకు పంచాయతీ పనులు చేయుటకు మరియు సామానులు సప్లయి చేయుటకు ఈక్రింది వివరించిన ప్రకారము టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 31-03-2023 సంవత్సరము తేదీన ఉదయం 11:00 గంటల వరకు స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 12:00 గంటలకు టెండరుదారులు సమక్షంలో తెరువబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకుని పోస్టు ఒక్కంటికి రూ. 50/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళయందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు
1	పారిశుద్ధ్య పనులు నిర్వహణకు 3 పోస్టులు	రూ. 50/-లు
2	PWS స్కీము ఫిట్టర్ 1 పోస్టులు	రూ. 50/-లు
3	రక్షత మంచినీటి సరఫరా పంపు ఆపరేటరు 2 పోస్టులు	రూ. 50/-లు
4	వీధి లైట్లు రిపేరు చేయువానికి 1 పోస్టు	రూ. 50/-లు
5	హరిత రాయబారులు 4 పోస్టు	రూ. 50/-లు
6	పారిశుద్ధ్య ప్రజారోగ్య సామాన్లు	రూ. 50/-లు
7	వీధి లైట్స్ విడి భాగములు మరియు కొత్త సెట్స్	రూ. 50/-లు
8	స్టేషనరీ సామానులు సప్లయ్	రూ. 50/-లు

నోట్: గ్రామపంచాయితీ నగదు నిల్వలను బట్టి పేమెంట్లు ఇవ్వబడును.

సం/- **వై.రఘునాధరావు,** పంచాయితీ కార్యదర్శి
దుంపగడప, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము - కొళ్ళపర్రు
టెండరు నోటీసు

రి.క. నెం. /2023 తేది.27-03-2023

పశ్చిమగోదావరి జిల్లా, ఆకివీడు మండలం, కొళ్ళపర్రు గ్రామపంచాయితీకి 2023-2024 సంవత్సరమునకు ఈ క్రింది వివరించిన ప్రకారము ది. 01-4-2023 నుండి 31-3-2024 సంవత్సరము వరకు పంచాయతీ పనులు చేయుటకు మరియు సామానులు సప్లయి చేయుటకు ఈక్రింది వివరించిన ప్రకారము టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 31-03-2023 సంవత్సరము తేదీన ఉదయం 11:00 గంటల వరకు స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 12:00 గంటలకు టెండరుదారులు సమక్షంలో తెరువబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకుని పోస్టు ఒక్కంటికి రూ. 50/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళయందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు
1	పారిశుద్ధ్య పనులు నిర్వహణకు 2 పోస్టులు	రూ. 50/-లు
2	రక్షిత మంచినీటి సరఫరా పంపు ఆపరేటరు 1 పోస్టులు	రూ. 50/-లు
3	వీధి లైట్లు రిపేరు చేయువానికి పోస్టు 1	రూ. 50/-లు
4	వాటర్ వర్క్సు సామాన్లు	రూ. 50/-లు
5	ఆఫీసు స్వీపింగ్ చేయుటకు 1 పోస్టు	రూ. 50/-లు
6	పారిశుద్ధ్య ప్రజారోగ్య సామాన్లు	రూ. 50/-లు
7	వీధి లైట్స్ విడి భాగములు మరియు కొత్త సెట్స్	రూ. 50/-లు
8	స్టేషనరీ సామానులు సప్లయ్	రూ. 50/-లు

నోట్: గ్రామపంచాయితీ నగదు నిల్వలను బట్టి పేమెంట్లు ఇవ్వబడును.

సం/- **వై.రఘునాధరావు,** పంచాయితీ కార్యదర్శి
కొళ్ళపర్రు, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా